క్లుప్తంగా

'ఉన్నతి' కార్యక్రమంపై అవగాహన


మాట్లాడుతున్న హెచ్ఎం రాము

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ప్రాథమికోన్నత స్థాయి గణిత కాంప్లెక్స్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, తాండూర్, నెన్నెల మండలాలకు సంబంధించిన గణిత ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఉన్నతి కార్యక్రమాన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా ఎలా నిర్వహించాలని, యూనిట్ ప్లాన్, టీచింగ్, లెర్నింగ్‌లపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీలు సంతోష్, మధుసూదన్, ఆర్పీ రమేష్, సీఆర్పీ ముడిమడుగుల స్వామి పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ

సారంగపూర్: మండలకేంద్రంలో గురువారం ఎంపీడీఓ సరోజ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఓటుహక్కు ప్రాధాన్యత, వినియోగంపై తహసీల్దార్ శ్రీదేవి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

కడెం: అర్హులు తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏపీడీ గోవిందరావు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఐకేపీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. డీపీఎం శోభ, ఏపీఎం రాజారాం ఉన్నారు.

కుట్టు మిషన్ అందజేత


కుట్టుమిషన్ అందజేస్తున్న సభ్యులు

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి శ్రీ శివ సాయి గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామ్మూర్తి, సభ్యులు సుమతమ్మ, సత్యనారాయణ, ప్రసన్న, వినోద్ శర్మ, ప్రభాకర్, ప్రశాంత్, విక్రమ్, రాకేష్, రిత్విక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రాజీనామా

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ శేశేరావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. అనూహ్య పరిణామాలతో శ్యామ్‌నాయక్‌కు టికెట్ దక్కడం, స్థానిక నేతలు పట్టించుకోకపోవడంతో తాను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఆసిఫాబాద్‌రూరల్: పది విద్యార్థులకు ఈనెల 21 నుంచి జనవరి 30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీటీడీవో రమాదేవి పేర్కొన్నారు. గురువారం జూమ్ మీటింగ్ నిర్వహించి హెచ్ఎంలకు పలు సూచనలు చేశారు. ఎస్ఏ 1 పరీక్ష ఆధారంగా విద్యార్థుల ప్రగతిని నిర్ధారించి వెనుకబడినవారిపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు


భక్తులను సన్మానిస్తున్న జగన్మోహన్ రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం పూజారులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అన్నదాతలుగా నిలిచిన సాయినిషిత, నిహర, రిత్విక, లక్ష్మీ-ధర్మరాజు, లత-అర్జున్, శిరీష-ప్రణయ్ దంపతులను ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయిదీక్ష సేవా సమితి సభ్యులు జైపాల్‌రెడ్డి, ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేశ్, భూషణ్, చౌదరి, ఆమెడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. భైంసా, లోకేశ్వరం దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), కుంటాల మండలాల నుంచి మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బస్టాండ్ నిర్మించేదెప్పుడో?

- బెజ్జూర్‌లో రోడ్డుపై బస్సుల నిలుపుదల
- చెట్ల కింద పడిగాపులు
- ప్రయాణికుల అవస్థలు


బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు (ఫైల్)

బెజ్జూర్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం.. క్షేమంగా గమ్యానికి చేరుకోండి..బస్సు మన అందరిది.. అంటూ ప్రచారం చేస్తున్న అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను గాలికొదిలేస్తున్నారు. ఏళ్లుగా బెజ్జూర్ బస్టాండ్ నిర్మించపోవడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపైనే బస్సులు నిలుపుతుండడంతో నిలువ నీడ లేక ఇక్కట్లు పడుతున్నారు.

కలగానే బస్టాండ్ నిర్మాణం

బెజ్జూర్ మండలవాసులకు బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. ఆయా గ్రామాల ప్రజలు పనుల నిమిత్తం మండలకేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల కోసం చెట్ల కింద, హోటళ్ల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

గతంలో నిధుల మంజూరు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే బెజ్జూర్ మారుమూల మండలంగా చెప్పుకోవచ్చు. 2004లో బెజ్జూర్ బస్టాండ్ నిర్మాణం కోసం అప్పటి ఎంపీ మధుసూదన్‌రెడ్డి రూ.60 వేలు మంజూరు చేయించారు. అయితే నిర్మాణానికి నిధులు సరిపోవని ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. అప్పట్లో బస్టాండ్ నిర్మాణం జరుగుతుందని సంబరపడ్డ ప్రజలు ఆ పనులు జరగకపోవడంతో నిరాశ చెందారు. దీంతో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని పలువురు పేర్కొంటున్నారు.

చెట్ల కింద ఉంటున్నాం



బెజ్జూర్ బస్టాండ్ లేక ఇబ్బంది పడుతున్నాం. బస్సుల కోసం గంటలతరబడి చెట్ల కింద ఉంటున్నాం. అధికారులు బస్టాండ్ నిర్మించేలా చర్యలు చేపట్టాలి. – కుమ్మరి శంకర్, బెజ్జూర్

అవస్థలు పడుతున్నాం



మండల కేంద్రం గుండా వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ బస్సు కోసం వేచిచూసేందుకు బస్టాండ్ లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. వేసవి, వర్షాకాలంలో ఇబ్బందిగా ఉంది. బస్టాండ్ నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలి. – జి.భిక్షమయ్య, బెజ్జూర్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


పథకాలను వివరిస్తున్న కళాకారుడు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు గోలేటి శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను మేనేజర్ విశ్వ ప్రసాద్ వివరించారు. సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలు గురించి తెలియజేశారు. కళాజాత బృందం మ్యాజిక్ షో, ఆటపాటల ద్వారా బ్యాంకు పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్ సలుగు శ్రావణ్, క్యాషియర్ సురేష్, బ్యాంకు సిబ్బంది ఇమ్రాన్, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో రవిదాస్

వాంకిడి: పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెచ్ఈవో రవిదాస్ పేర్కొన్నారు. మండలంలోని కనర్‌గాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పరిసరాలు శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాల, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారానే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో డ్రైడే కార్యక్రమం చేపట్టి యాంటి లార్వా మందులు వేశారు. హెచ్ఏలు భగవాన్‌దాస్, సునీత, ఎమ్ఎల్‌హెచ్‌పి రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండ

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన దూదేకుల షేక్ అహ్మద్ (64) బుధవారం నిర్మల్‌లో జరిగిన రేవంత్‌రెడ్డి సభకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్టారెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.20 వేలను సాయంగా అందించారు. అలాగే కాంగ్రెస్ నాయకులు అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, అట్ల చిన్న రాంరెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి తమ వంతుగా రూ.50వేలు అందించారు.

పశువైద్యశాల ప్రారంభమెప్పుడో?

- ప్రభుత్వ భవనంలోకి తరలింపునకు నిర్ణయం
- పనులు పూర్తికావస్తున్నా.. ప్రారంభించని వైనం
- పీహెచ్‌సీలో కొనసాగుతున్న పశువైద్యశాల


ప్రారంభానికి సిద్ధంగా పశువైద్యశాల

కెరమెరి: ఏళ్లుగా పశువైద్యశాలకు ప్రత్యేక భవనం లేకపోవడంతో అనేక ఇబ్బందులు తప్పలేదు. ఏడాది క్రితమే నూతన భవనంలోకి పశువైద్యశాలను తరలించేందుకు అధికారులు, నాయకులు ఏర్పాట్లు చేసినప్పటికి ఇంకా కార్యరూపం దాల్చలేదు. కెరమెరి ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగంలో ఉన్న నిరుపయోగంగా భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకున్నారు. చిన్న చిన్నపనులు మినహా అన్ని పూర్తికావచ్చాయి. కాని ప్రారంభమెప్పుడనేది ఇంకా నిర్ణయించలేదు. మండలంలో ఆవులు, ఎడ్లు 18057, గేదెలు 613, గొర్రెలు 986, మేకలు 33273, కోళ్లు 20000 ఉన్నాయి.

పీహెచ్‌సీ ప్రాంగణంలో..

కెరమెరి పశువైద్యశాల ప్రస్తుతం పీహెచ్‌సీ ప్రాంగణంలో కొనసాగుతోంది. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షానికి ఊరుస్తుంది. స్లాబ్ పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. పై కప్పు పెచ్చులు ఊడుతున్నాయి. దీంతో రికార్డులు అక్కడ ఉంచేందుకు అధికారులు భయపడుతున్నారు. సుమారు 32 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతోపాటు ఇప్పటి వరకు మరమ్మతు చేపట్టలేదు. సిబ్బంది సరిపడా లేకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. సహాయ పశువైద్యాధికారి, అటెండర్ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు కాగా, చిర్రకుంటకు చెందిన వైద్యాధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ వైద్యాధికారితోపాటు మరో ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉంది. ప్రస్తుతం ఉపవైద్యాధికారి సహాయ పశువైద్యాధికారి లీవ్‌లో ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అటెండరే అన్నీతానై చూస్తున్నాడు.

ఎన్నికలు ముగియగానే..



ప్రస్తుతం ఉన్న పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో పశువులకు వైద్యం చేసేందుకు ఇబ్బంది అవుతోంది. ఎంపీడీవో కార్యాలయం వెనుకభాగంలో ఉన్న ఖాళీ భవనాన్ని వారికి అప్పగించాం. అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే ప్రారంభిస్తాం.
– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

అనుబంధానికి ప్రతీక

- 'భావుబీజ్'ఉత్సవాలు
- ఉమ్మడి జిల్లాలో ఘనంగా ప్రారంభం
- కార్తీకపౌర్ణమి వరకు కొనసాగింపు
- గ్రామాలకు చేరిన సోదరీమణులు


కాళ్లు కడుగుతున్న చెల్లి

కెరమెరి(ఆసిఫాబాద్): అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే భావుబీజ్ ఉత్సవాలను గురువారం ప్రారంభమయ్యాయి. మహారాష్ట్రలోని ఈ పండుగను ఘనంగా జరుపుకోగా, సరిహద్దు ప్రాంతాల్లో దీన్ని నిర్వహిస్తుంటారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, కుమురం భీం, నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. కార్తీకపౌర్ణమి వరకు ఈ పండుగ కొనసాగుతోంది. దీపావళి పర్వదినం తర్వాత నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అక్కాచెల్లెళ్లు స్వగ్రామాలకు చేరుకుని అన్నదమ్ములు కొబ్బరికాయ, నూతనవస్త్రాలు, తమలపాకులు, పోకలను అందిస్తారు. మిఠాయిలు తినిపించి మంగళహారతులు ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటారు.

భావుబీజ్ అంటే..!

భావుబీజ్ పండుగపై కథలు ఎన్నో ప్రాచుర్యంలోకి ఉన్నాయి. యమధర్మరాజు తన చెల్లి యమున ఇంటికి వెళ్లి నూతన వస్త్రాలు అందించి అలంకరిస్తాడు. అనంతరం యమున ఇంట్లోనే భోజనం చేస్తారు. ఈరోజు యమున నదిలో స్నానం చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. అందుకే ఈరోజున భావుబీజ్ అంటారు. యమధర్మరాజు మృతి చెందాక యమున కళ్లలోంచి కన్నీరు ఆగలేదు. అప్పుడు భగవానుడు రాతిని నిర్మాణం చేయగానే యమున కన్నీళ్లు ఆగాయి. అన్న మృతితో కలిగిన దు:ఖం కొంత తగ్గింది. అప్పటి నుంచి భావుబీజ్‌ను నిర్వహిస్తారని పురాణాలు చెబుతున్నాయి. కొన్నిప్రాంతాల్లో చిత్రగుప్తున్ని ఆలయంలో పూజలు చేస్తారు. ఈరోజు అక్కాచెల్లెళ్లలో అన్నదమ్ములు ఇళ్లకు వెళ్లి హారతి ఇస్తారు. వారి ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రోజును ఉత్సవంగా భావిస్తారు. ఎవరికైతే అన్నదమ్ములు లేని అక్కాచెల్లెళ్లు ఉంటారో వారు చంద్రున్ని అన్న తమ్ముడిగా భావిస్తారు.

ప్రేమకు గుర్తుగా..



అన్నదమ్ముల ప్రేమకు గుర్తుగా ప్రతిఏటా దీపావళి తర్వాత రెండో రోజు భావుబీజ్ పండుగను జరుపుకుంటాం. అన్నదమ్ములు, వారి కుటుంబసభ్యుల ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తాం. అన్నదమ్ములు ఎక్కడున్నా వారి వద్దకు వెళ్లి మంగళహారతి ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటాం.
– చోతే మీరా, గృహిణి, కెరమెరి

'గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు'


మాట్లాడుతున్న జాడే నాగోరావు

నార్నూర్: గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు తెలుపుతామని గిరిజనేతరుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బౌద్ధవిహార్‌లో సమావేశం నిర్వహించారు. గిరిజనేతరుల సంఘం రాష్ట్ర నాయకుడు భారత్ వాఘ్మారే పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు ఎలాంటి హాని కలుగకుండా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. గత 70 ఏళ్లకు పైగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు పోడుపట్టాలు అందించాలన్నారు. గిరిజనేతరుల సమస్యల పరిష్కారం కోసం ఎవరైతే స్పష్టమైన హామీ ఇస్తారో వారికే ఓటు వేస్తామన్నారు. సమావేశంలో నాయకులు కేంద్రే మాదవ్, కార్యదర్శి షేక్ దాదేఅలీ, నాయకులు బ్రిజ్‌లాల్, జాకురుల్లాఖాన్, సత్తార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బుంగ.. ప్రయాణికుల బెంగ



మందమర్రిరూరల్: పట్టణంలోని బియ్యం వ్యాపారుల గల్లి ప్రారంభంలో కల్వర్టుపై ఏర్పడిన బుంగ ప్రమాదకరంగా ఉంది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. కల్వర్టు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించడం వల్లనే బుంగ ఏర్పడిందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరగా మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

మీడియా స్వేచ్ఛను కాపాడాలి


కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్

ఆసిఫాబాద్‌అర్బన్: మీడియా స్వేచ్ఛను కాపాడాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలో జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు మీడియాపై దాడులు, నిర్బంధాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల రక్షణ చట్టాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు ప్రకాశ్ గౌడ్, పాత్రికేయులు తారు, మేకల శ్రీనివాస్, దేవునూరి రమేశ్, సురేష్ చారి, రాందాస్, రాధాకృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

భవనం ఒకటే.. కార్యాలయాలు రెండు



కెరమెరి: మండలంలోని దేవాపూర్ పంచాయతీలో ఒకే భవనంలో రెండు కార్యాలయాలు పనిచేస్తున్నాయి. ఉన్నదే చిన్న భవనం అందులోనే గ్రామ పంచాయతీ, తపాలా కార్యాలయం కొనసాగుతోంది. ఇలాంటి అవస్థలు మండలంలో వివిధ పంచాయతీల్లో ఉన్నాయి. కొన్నిచోట్ల పాఠశాలల్లో, మరికొన్ని చోట్ల ఇళ్లల్లోనే ఏర్పాటు చేశారు.

పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం


పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం విజయనిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, గంగాభవాని, బడేసాహెబ్, సుజాత, నగేష్, లక్ష్మి, కళావతి, శ్రీధర్, రమాదేవి, విజయ్, భారత రత్న, సాదియా, సాయితేజ, సీఆర్పీలు శ్యాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంటకు రక్షణగా చీరె



కెరమెరి: మండలంలోని దేవాపూర్ పంచాయతీ పరిధిలో ఓ చేనుకు చీరె రక్షణ కల్పిస్తుంది. ఇటీవల కాలంలో పందుల బెడద అధికమైంది. కోతులు పంటల కాయలను తింటున్నాయి. దీంతో వాటి బారి నుంచి రక్షణ కల్పించేందుకు రైతు చేసిన ఉపాయమిది.

కొత్తగూడలో నగర సంకీర్తన


భజన చేస్తున్న సాయిభక్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ గ్రామంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం నగర సంకీర్తన నిర్వహించారు. సంకీర్తనలతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం హనుమాన్ ఆలయంలో భజన చేశారు. భజన మండలి అధ్యక్షుడు సాయిరాం పాల్గొన్నారు.